సాక్షి పెద్దపల్లి

గురువారం । 20 । జూలై । 2023



అలరించిన సింగరేణి కళోత్సవాలు

గోదావరిఖని: సింగరేణి కళాకారుల 'కళోత్సవం' ఆకట్టుకుంది. సంస్థ వ్యాప్తంగా 11ఏరియాలకు చెందిన 200మంది కళాకారులు తమ ప్రతిభను కనబర్చారు.



రేషన్ బియ్యం పంపిణీ ఎప్పుడు?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆకలి తీర్చేందుకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం

32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెల్పుతున్న దాసరి

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

పెద్దపల్లిరూరల్/గోదావరిఖని/కోల్‌సిటీ: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను బుధవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, రామగుండం ఎమ్మెల్యే చందర్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



మమతారెడ్డి, చందర్, హిమబిందు సింగ్

ఖాళీ జాగా.. మురుగు పాగా

- అపరిశుభ్రతకు నిలయాలుగా ఓపెన్ ప్లాట్లు
- ఖాళీ స్థలాల్లో చేరుతున్న మురుగు, వరద నీరు
- దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్న వైనం

సాక్షి, పెద్దపల్లి: బల్దియాల్లో భూముల ధరలు రోజు రోజుకూ పెరుగుతుండడం.. రియల్ వ్యాపారం జోరుగా సాగుతుండడంతో ఇళ్లు కట్టుకోవాలని, భవిష్యత్తులో భూమి విలువ పెరుగుతుందన్న ఆశతో ప్లాట్లు కొనుగోలు చేస్తున్నా రు. అయితే వాటి నిర్వహణ విషయంలో మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఆ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి మురికికూపాలను తలపిస్తున్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు పట్టణవాసులను భయపెడుతున్నాయి. వీటిలో వర్షం నీరు నిల్వ ఉండటం, చెత్తను తీసుకొచ్చి పడేయడం, తీరా ఆ చెత్తలో పందులు సంచరించడం వంటి సమస్యలు ఎదురవుతున్నా కనీసం పొరస్పృహ లేకుండాపోతోంది. ఇళ్లలోకి దోమలు వచ్చి కుడుతాయని, దుర్వాసన వస్తుందనే విషయాన్ని పట్టించుకోవడం లేదు.

స్థలాలు కొని.. వదిలేసి

జిల్లాలోని మున్సిపాలిటీలల్లో భూముల ధరలు పెరుగుతున్నాయి. చాలామంది ప్లాట్లు కొని.. రిజిస్ట్రేషన్ చేసుకుని, హద్దురాళ్లు పాతుకుని వదిలేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో అక్కడ చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. నీరు చేరి మురికికూపాలుగా మారుతున్నాయి. ప్లాట్ల యజమానులదే వాటిని పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత. ఒకవేళ వారు పట్టించుకోకపోతే బల్దియా అధికారులు సదరు యజమానులకు నోటీసులు ఇవ్వాలి. స్పందించకపోతే స్థానికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బల్దియా సిబ్బంది జేసీబీ సహాయంతో మురుగును తొలగించి చదును చేయాలి. అందుకు ఎంత ఖర్చు అవుతుందో లెక్కేసి జరిమానాతో సహా యజమాని నుంచి వసూలు చేయాలి. గతంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు ఇలాంటి వాటిని గుర్తించి చదును చేసుకోవాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. తరువాత అందరూ మరిచిపోయారు. ప్రస్తుతం ఖాళీ ప్రదేశాలన్నీ ఎప్పటిలాగే మారాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో వీటిపై దృష్టిసారించాలని పట్టణవాసులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులను అడగ్గా గతంలో నోటీసులు జారీచేశామని, అటువంటి ఓపెన్ ప్లాట్స్ గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఈ చిత్రంలో చెట్లపొదలు, మురికి కాలువ నీటితో దుర్గంధం వెదజల్లుతూ కనిపిస్తున్నది జిల్లాకేంద్రంలోని హనుమాన్‌నగర్‌లోనిది. పట్టణ పరిధిలో సుమారు 900కు పైగా ఓపెన్ ప్లాట్స్‌ను అధికారులు గుర్తించారు. అందులో మెజారిటీ యజమానులు స్థానికంగా ఉండటం లేదు. వారికి నోటీసులు జారీచేయలేని పరిస్థితి నెలకొందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. వర్షాకాలంలో వరదతో మురికినీరు చేరి పట్టణవాసులు రోగాలబారిన పడుతున్నారు. ఇదే పరిస్థితి మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లోనూ ఉంది.



ఈ చిత్రంలో ఇళ్ల మధ్య కనిపిస్తున్న మురికికూపం రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మార్కండేయ కాలనీలోనిది. కార్పొరేషన్‌లో సుమారు ఐదు వేలకు పైగా ఖాళీ స్థలాలు ఉంటాయి. ఆ స్థలాలపై బల్దియా పారిశుధ్యం అధికారులు దృష్టి పెట్టకపోవడంతో మురికికూపాలను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోయి, వర్షం నీరు నిలిచి, దోమలకు నిలయమయ్యాయి. ఇప్పటివరకు ఆ ఖాళీ స్థలాల యజమానులకు కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. ఫలితంగా స్థానికంగా నివాసం ఉంటున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

జనం పాటించాల్సినవి

- ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించడం. తమ పరిసరాల్లోని తొట్టిల్లో ఉన్న నీటిని తీసివేయటం, ఇంటి చుట్టుపక్క నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించడం.
- ఇళ్లలోకి దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం.. డెంగీ కారణమయ్యే ఏడిస్ దోమ మధ్యాహ్నం సమయంలో కుడుతుంది కాబట్టి ఆ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం.
- ఇంటి పరిసరాల్లో అవసరంలేని వస్తువులు భవనాలపై, షెడ్లలో వేయకుండా చూడడం.

యంత్రాంగం చేయాల్సినవి

- వీధుల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా మురుగునీటి గుంతలు పూడ్చడం.
- మురుగు కాలువల్లో కిమోపాస్, మాలథిన్ రసాయనాలను పిచికారీ చేయించడం.
- దోమల లార్వాను చంపేందుకు మురుగుకుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయించడం.
- దోమల నివారణకు గంబూషియా చేపలను వదలడం.. విధిగా వీధుల్లో ఫాగింగ్ చేయించడం.

పేదలులేని 'పెద్ద'పల్లి

- తరువాతి స్థానంలో కరీంనగర్
- జాతీయ బహుముఖ పేదరిక సూచీలో వెనకబడ్డ జగిత్యాల

సాక్షిప్రతినిధి,కరీంనగర్: పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తాజాగా 'జాతీయ బహుముఖ పేదరిక సూచి (ఎంపీఐ)– ఒక ప్రగతి సమీక్ష' పేరిట నీతి ఆయోగ్ విడుదలచేసిన నివేదిక గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జాతీయస్థాయిలో నిర్వహించిన ఈసర్వేలో పలుఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ముఖ్యంగా దేశంలో పేదరికం తగ్గి, ఆర్థిక అంతరాలు క్రమంగా సమసిపోతున్నాయని నివేదిక పునరుద్ఘాటించింది. నేషనల్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సర్వే (ఎన్‌హెచ్‌ఎఫ్ఎస్)–4తో ఎన్‌హెచ్‌ఎఫ్ఎస్–5తో పోల్చి ఈ సర్వే వివరాలను నీతి ఆయోగ్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఉమ్మడి జిల్లాలోనూ పేదరికం తగ్గింది. జగిత్యాలలో 4.77 శాతం, రాజన్న సిరిసిల్లలో 3.68 శాతం, కరీంనగర్‌లో 2.50 శాతం, పెద్దపల్లిలో 2.17 శాతంగా నమోదైంది. ఇందులో పెద్దపల్లి అతితక్కువ 2.17 శాతం పేదరికంతో రాష్ట్రంలో అత్యంత తక్కువ సంఖ్యలో పేదలు ఉన్న జిల్లాగా రికార్డు సృష్టించింది. జిల్లాలో అధికశాతం పారిశ్రామిక ప్రాంతం కావడం, రోడ్డు రవాణా, రైల్వే కనెక్టివిటీ, విద్యా, వైద్యం తదితర సదుపాయాల దృష్ట్యా మొదటి నుంచి పెద్దపల్లి జిల్లా ముందువరుసలో నిలిచింది. తాజాగా నీతిఆయోగ్ విడుదలచేసిన నివేదికలోనూ ఇదే విషయం పునరావృతం కావడం గమనార్హం.

న్యూస్‌రీల్

తెలంగాణ అభివృద్ధిలో నాబార్డు పాత్ర



మంథని: రాష్ట్ర అభివృద్ధిలో నాబార్డు ముఖ్య భూమిక పోషిస్తోందని నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జయప్రకాష్ అన్నారు. మంథనిలో బుధవారం నిర్వహించిన ఆజాదికాఅమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు, రైతుల ఆర్థిక అభివృద్ధికి నాబార్డు విశేష కృషి చేస్తోందని, ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఎస్‌హెచ్‌జీ మహిళల కోసం ఎంఈడీపీ, ఎల్ఈడీపీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. మహిళలకు బ్యాంకుల్లో క్రెడిట్ లింకేజీ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఏపీఎం పద్మ, రజిత, పెండ్లి సంపత్ కుమార్, పెసరి రాజు, మహిళలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



పెద్దపల్లిరూరల్: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ప్రియాంక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జెడ్పీ సీఈఓగా పనిచేసిన ప్రియాంకను జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అనంతరం ప్రియాంక మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రి వద్దకు 'అసమ్మతి పంచాయితీ'

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్‌లో చోటుచేసుకున్న అసమ్మతి పంచాయితీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వద్దకు చేరింది. స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు వ్యతిరేకంగా ఐదురోజులుగా ప్రజలు, నాయకుల మద్దతు కూడగడుతున్న ఎమ్మెల్యే ఆశావహులు బహిరంగంగా విమర్శలు కూడా చేస్తున్నారు. రాష్ట్ర నాయకత్వాన్ని సమర్థిస్తూనే ఎమ్మెల్యే తీరుపై స్వరం పెంచుతున్నారు. ఉదయం గనులు, మధ్యాహ్నం నగరం, సాయంత్రం గ్రామాల్లో జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, బయ్యపు మనోహర్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు. వీరికి మంత్రి కొప్పుల నుంచి పిలుపురావడంతో మూకుమ్మడి మంత్రి వద్దకు బయల్దేరి వెళ్లారు. మంత్రి మాట్లాడుతూ.. తమకు టికెట్ కావాలని ప్రచారం చేసుకోవాలని, ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శలు చేయొద్దని సూచించారు. రామగుండంలోని రాజకీయ పరిణామాలతోపాటు అన్ని విషయాలు అధిష్ఠానం గమనిస్తోందని పేర్కొన్నారు.

కార్పొరేషన్‌లో టోల్ ఫ్రీ నంబర్లు

కోల్‌సిటీ(రామగుండం): రానున్న రెండు మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం కార్పొరేషన్‌లో టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సహాయం అవసరమైన వారు టోల్ ఫ్రీ నంబర్ 18004257062, 9603666444కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని కోరారు.

రైతు సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

- కాంగ్రెస్‌కు ఓటేస్తే మనకు మనం చంపుకున్నట్లే
- రైతు వ్యతిరేక కుట్రలను తిప్పి కొట్టాలి
- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: రైతును రాజుగా చూడాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో అన్నదాతల్లో అయోమయాన్ని సృష్టిస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం పాలితం రైతువేదికలో బుధవారం మండలంలోని నిట్టూరు, నిమ్మనపల్లి, తుర్కలమద్దికుంట, గోపయ్యపల్లి గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. రైతులను గోస పెట్టేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కార్ నిరంతర విద్యుత్ అందిస్తుంటే కాంగ్రెస్ నాయకులు మూడుగంటలు చాలంటున్నారని తెలిపారు. రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి, విండో చైర్మన్ చంద్రారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ రైతువేదికలో సర్పంచ్ మాంకాలి తిరుపతి అధ్యక్షతన రైతన్న మేలుకో కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఆర్థికంగా బలంగా ఉంటేనే దేశం బాగుంటుందని, వారిని అన్ని విధాలా ప్రోత్సహించడం కేసీఆర్‌కే సాధ్యమని తెలిపారు. ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, వైస్ ఎంపీపీ మొగురం రమేశ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద బీమా చెక్కు అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం పంచాయతీ పరిధి ఊశన్నపల్లెకు చెందిన రైతు పెండ్లి సంపత్ కరెంట్ మోటారు అమరుస్తుండగా విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆయన భార్య అనసూర్యకు ఎన్‌పీడీసీఎల్ మంజూరు చేసిన రూ.5లక్షలు చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, సర్పంచు కొనకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ కదురు మానస ట్రాన్స్‌కో అధికారులు ఉన్నారు.

రైతులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

పాలకుర్తి: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తుంటే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాత్రం మూడు గంటలే సరిపోతుందంటున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆయన రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలోని పుట్నూర్ రైతువేదికలో బుధవారం మాట్లాడారు. రైతుల సంక్షేమాన్ని చూసి ఓర్వలేని రేవంత్‌రెడ్డి కేవలం మూడు గంటలు చాలనడం కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలని తీర్మానం చేశారు. వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి మాట్లాడుతూ నిరంతర విద్యుత్ అందిస్తున్న బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు మక్కాన్‌సింగ్ నియోజకవర్గ అభివృద్ధిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, శాప్ చైర్మన్‌గా ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. జయ్యారం మాజీ ఎంపీటీసీ ఎర్రం మధునయ్య పార్టీలో చేరారు. పుట్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్య యాత్ర..

మండలంలోని గుడిపల్లి, జయ్యారంలో ఎమ్మెల్యే చందర్ ప్రగతి ప్రజాచైతన్యయాత్ర నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించారు.

నష్టపోయిన పంటలకు పరిహారం ఏదీ..?

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



బహుజన యాత్రలో పాల్గొన్న ప్రవీణ్ కుమార్

సుల్తానాబాద్: ఇటీవలి అకాల వర్షాలకు జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పటికీ ఎందుకు అందించలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్ర బుధవారం సుల్తానాబాద్‌కు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు సర్వం కోల్పోయిన రైతులను ఆదుకోవాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు విఫలమయ్యారని తెలిపారు. 46 జీవోను ప్రభుత్వం సవరించాలని డిమాండ్ చేశారు. బీసీలకు కేటాయించిన నిధులు ఎటు వెళ్తున్నాయో ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా బీసీలకు చేసింది శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ బీసీలకు 60 నుంచి 70 అసెంబ్లీ స్థానాల కేటాయిస్తుందన్నారు. ముందుగా శాస్త్రీనగర్, పూసాలలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, జిల్లా అధ్యక్షుడు గొట్టే రాజు, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక ముద్ర వేశారు

- శ్రద్ధతో సంక్షేమ పథకాలు అమలు చేశారు
- అధికారులను కొనియాడిన మంత్రి, ఎమ్మెల్యేలు
- బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సంగీత, అదనపు కలెక్టర్లకు వీడ్కోలు



మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో బదిలీ అయిన అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కలెక్టర్‌గా సంగీత, అడిషనల్ కలెక్టర్లుగా లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్ జిల్లా అభివృద్ధిలో.. సంక్షేమ పథకాల అమలులో తమదైన ముద్ర వేశారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బదిలీపై వెళ్తున్న వారికి బుధవారం కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారులు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు కిందిస్థాయి అధికారులు, సిబ్బందితో స్నేహపూర్వక వాతావరణంలో పనిచేసి సమస్యలకు సత్వర పరిష్కారం చూపారని తెలిపారు. ఉన్నత అధికారులంతా ఒకేసారి బదిలీ కావడం లోటుగా ఉందన్నారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

పెద్దపల్లిని మరచిపోలేం..

జిల్లా ప్రజలు తమకు అందించిన సహకారం మరువలేనిదని కలెక్టర్ సంగీత అన్నారు. ప్రభుత్వం పథకాలను పకడ్బందీగా అమలు చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించారని తెలిపారు. ప్రజలిచ్చే వేతనంతో పనిచేసే అవకాశం ప్రభుత్వ ఉద్యోగులకే దక్కుతుందని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లాలో పట్టణ, పల్లెప్రగతి కార్యక్రమాల ఫలితంగానే జిల్లాకు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు.

వానొచ్చే.. వరదొచ్చే!

- వరుసవానలతో ప్రాజెక్టులకు వరద
- నాట్లు మొదలుపెట్టిన రైతన్నలు
- ఎగువ ప్రవాహాలతో మిడ్‌మానేరు దిగువకు నీరు
- ఎల్లంపల్లికి వరద ఉధృతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వరుసగా కుస్తున్న వర్షాలతో రైతులు పొలంపనులు మొదలుపెట్టారు. బుధవారం సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో అత్యధికంగా 3.2 సెం.మీ వర్షపాతం, పెద్దపల్లిలో కాల్వ శ్రీరాంపూర్‌లో 2.9 సెం.మీ, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం 2.8 సెం.మీ, కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలో 2.9 సెం.మీల వర్షపాతం నమోదైంది.

పెరుగుతున్న ఇన్‌ఫ్లో..

కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి కొన్నిరోజులు, ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మొదలైన వరద ప్రవాహాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ఈనెల 15 వరకు ఎలాంటి వానలు లేకపోవడంతో ఇక ప్రాజెక్టులను కాళేశ్వరం నీటితో నింపేందుకు పంపింగ్ ప్రారంభించారు. రామడుగు లక్ష్మీపూర్ పంప్‌హౌస్ ద్వారా కాళేశ్వరం జలాలతో మిడ్‌మానేరును నింపుతున్నారు. అక్కడి నుంచి దిగువకు వదుతారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సైతం ఈనెల 17న మిడ్‌మానేరు నుంచి కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేసిన 5 టీఎంసీల నీటిని దిగువన ఉన్న లోయర్‌మానేరు డ్యాంకు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇంతలో వర్షాలు మొదలయ్యాయి. దీంతో రైతులు నాట్లు వేయడంలో తలమునకలయ్యారు. మానేరుపై నిర్మించిన ప్రాజెక్టులకు మానేరు నది, మోయతుమ్మెద వాగు, ఎస్సారెస్పీ, మూలవాగుల నుంచి వచ్చే ప్రవాహాలే మూలాధారం. వాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి వరద లేకపోవడంతో ప్రాజెక్టులలోకి తక్కువ నీరు చేరుతోంది.

మిడ్‌మానేరు నుంచి దిగువకు..

మానేరుపై బోయిన్‌పల్లి వద్ద నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఈనెల 12న ప్రాజెక్టులో 15.61 టీఎంసీల నీరు ఉండగా.. ప్రస్తుతం అదే స్థితి కొనసాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వరదకు తోడు, ప్రాజెక్టులోకి లక్ష్మీపూర్ పంప్‌హౌస్ ద్వారా 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరుతుంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు ఆరు గేట్ల ద్వారా 9,320 క్యూసెక్కుల నీరు లోయర్‌మానేరు డ్యాం (ఎల్ఎండీ) ప్రాజెక్టులోకి దిగువకు వదలుతున్నారు. ప్రాజెక్టు నుంచి వెళ్లే నీటితో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాలకు నీరందనుంది.

- దిగువనే ఉన్న లోయర్ మానేరులోకి మిడ్‌మానేరు మినహా పెద్దగా ఇన్‌ఫ్లో లేదు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా గతవారం వరకు కేవలం 8 టీఎంసీల నీరే ఉంది. ప్రస్తుతం మిడ్‌మానేరు నుంచి వచ్చే నీటి ద్వారా 9.5 టీఎంసీలకు చేరింది. లోయర్‌మానేరు డ్యాంకు ప్రధాన ఆధారమైదన మోయతుమ్మెద వాగు నుంచి ఆశించిన స్థాయిలో వరద రాకపోవడంతో లోయర్‌మానేరు నెమ్మదిగా నిండుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 9.88 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది.
- పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లికి వరద పోటెత్తుతోంది.



గోదావరినదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 20.175 టీఎంసీలు. వర్షాలు జాప్యం కావడంతో గతవారం ప్రాజెక్టులో కేవలం 13 టీఎంసీల నీరు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఎగువన కురుస్తున్న వర్షాలు, కడెం, ఎస్సారెస్పీ నుంచి దిగువకు వస్తున్న నీరు భారీగా ఉంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం 15.17 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 5,712 క్యూసెక్కులుగా ఉండగా, ఔట్‌ఫ్లో 12,721 క్యూసెక్కులుగా ఉంది. ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి 2.20 లక్షల ఎకరాలకు నీరందిస్తారు.

పెద్దపల్లి జిల్లాలో..

ధర్మారంలో 18.2 మి.మీ, పాలకుర్తిలో 8.3, అంతర్గాంలో 6.9, రామగుండంలో 5.4, రామగిరిలో 8.2, కమాన్‌పూర్ 8.0, పెద్దపల్లిలో 11.6, జూలపల్లిలో 9.2, ఎలిగేడులో 16.9, సుల్తానాబాద్‌లో 14.7, ఓదెలలో 16.9, కాల్వశ్రీరాంపూర్‌లో 21.9, ముత్తారంలో 14.0, మంథనిలో 18.5 మి.మీ. కురిసింది.

ప్రాజెక్టు	సామర్థ్యం	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
మిడ్‌మానేరు	27.50 టీఎంసీ	15.67 టీఎంసీ	8,500 క్యూసెక్కులు	9320 క్యూసెక్కులు
లోయర్‌మానేరు	24.03 టీఎంసీ	09.5 టీఎంసీ	9,210 క్యూసెక్కులు	210 క్యూసెక్కులు
ఎల్లంపల్లి	20.17 టీఎంసీ	15.17టీఎంసీ	5,712 క్యూసెక్కులు	12,721 క్యూసెక్కులు

వారం రోజుల క్రితం ప్రాజెక్టుల నీటినిలువ	
మిడ్‌మానేరు	15.61 టీఎంసీలు
లోయర్‌మానేరు	8.44 టీఎంసీలు
ఎల్లంపల్లి	13.78 టీఎంసీలు

క్లుప్తంగా

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్



గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్-1 పరిధిలోని పలు కేటగిరీల ఉద్యోగులకు డీ, టీ-2, ఎంబీ, ఎస్టీ-2 టైప్ క్వార్టర్ల కేటాయింపునకు బుధవారం గోదావరిఖని ఆర్సీవోఏ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 118 క్వార్టర్లకుగాను 224 మంది దరఖాస్తు చేసుకోగా అర్హత, కేటగిరీని బట్టి కేటాయించారు. కార్యక్రమంలో సీనియర్ పీవో దేవర శ్రవణ్, కందగడ్ల శ్రీనివాస్, సంక్షేమ అధికారులు హనుమంతరావు, గణేశ్, దేవాచారి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం కావాలి



గోదావరిఖని: ప్రమాదాల నివారణే లక్ష్యంగా సింగరేణి ఉద్యోగులు ముందుకు సాగాలని రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య అన్నారు. బుధవారం వకీల్‌పల్లిగనిపై ఏర్పాటు చేసిన సేఫ్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నా భద్రత-నాదే బాధ్యత అనే నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. పనిస్థలాల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను వివరించారు. భూగర్భ గనిలో పని చేస్తున్న సమయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. గ్రూప్ ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీర్ చంద్రశేఖర్, మేనేజర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఖాజా జహీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-02, పొలిటికల్ సైన్స్-01, కామర్స్-02, కంప్యూటర్స్-03 పోస్టులకు విద్యార్హతలు పీజీ సంబంధిత సబ్జెక్టులో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఈటీ కలిగి, బోధనానుభవం ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 22న సాయంత్రం 4 గంటల్లోపు ప్రిన్సిపాల్ ఆఫీసులో దరఖాస్తు అందజేయాలని సూచించారు. ఇంటర్వ్యూ పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 63057 22857 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మంథని: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తాహెర్‌హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-1, ఇంగ్లిష్-1, రాజనీతి శాస్త్రం-1, కంప్యూటర్ సైన్స్-1 పోస్టులకు పీజీలో 55 శాతం మార్కులు, నీట్, సెట్ ఉత్తీర్ణత, పీహెచ్‌డీ చేసి, బోధనలో అనుభవం అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ప్రిన్సిపాల్ ఆఫీస్‌లో అందించాలని సూచించారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో నిర్వహించే ఇంటర్వ్యూకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.



చలో చలో.. వ్యవసాయ పనులకు ట్రాక్టర్, ఎడ్లబండిపై వెళ్తున్న మహిళా కూలీలు, రైతులు





దున్నేయాలి.. టిల్లర్‌తో పొలం దున్నుతున్న రైతు



ఎత్తుపల్లాలుండొద్దు.. జంబు కొడుతున్న అన్నదాతలు



గడ్డి ఉండొద్దు.. ఒడ్డుపై గడ్డి తొలగిస్తున్న రైతు



వరుసగా.. చకచకా.. నాటు వేస్తున్న మహిళా కూలీలు



చెక్కేస్తా.. ఒడ్డు చెక్కుతున్న రైతు

వర్షం కురిసింది.. సాగు ఊపందుకుంది

జిల్లాలో రెండు మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో అన్నదాతలు సాగు పనుల్లో బిజీ అయ్యారు. ఉదయాన్నే పలుగు, పారతో పొలం వైపు అడుగులు వేస్తున్నారు. నాట్లు వేసేందుకు మహిళలు ఆటోలు, ట్రాక్టర్లలో బయల్దేరుతున్నారు. నాట్లు వేస్తూ మహిళలు.. నారు అందిస్తూ కూలీలు.. పొలం దున్నిస్తూ రైతులు.. ఇలా ఎవరి పనుల్లో వారు బిజీగా మారారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఆకలేస్తోంది.. మధ్యాహ్నం భోజనం చేస్తున్న కూలీలు



త్వరగా నాటవ్వాలి.. నారు వేస్తున్న రైతులు

రేషన్ బియ్యం పంపిణీ ఎప్పుడు?

- మెజారిటీ పట్టణాలు, గ్రామాలకు నేటికీ చేరని వైనం
- గోదాం నుంచి ఇంకా అలాట్ కాలేదంటున్న పలువురు డీలర్లు
- లబ్ధిదారుల ఎదురుచూపు
- జిల్లాలో రేషన్ కార్డులు 2,10,147



సుల్తానాబాద్ గోదాంలో వేలిముద్ర వేస్తున్న డీలర్

సుల్తానాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆకలి తీర్చేందుకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నాయి. ప్రతినెలా 5వ తేదీ నుంచి ఇవ్వాల్సిన బియ్యం ఈ నెల ఇప్పటివరకు 90 శాతం గ్రామాల్లో ప్రారంభం కాలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం రేషన్ డీలర్ల వేలిముద్ర తీసుకున్న తర్వాత సరుకులను లారీల్లో దుకాణాలకు చేరవేస్తున్నామని చెబుతున్నారు. కానీ ఆచరణలో తీవ్ర జాప్యం జరుగుతోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. కాగా, వచ్చే స్టాక్‌లో భారీ తేడా ఉండటంతో డీలర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. స్టాక్ సక్రమంగా పంపిణీ చేసేందుకు వేలిముద్ర పెట్టినప్పటికీ బరువు గురించి అడగవద్దని గోదాం ఇన్‌చార్జీలు చెబుతున్నారని పలువురు అంటున్నారు. కథ మళ్లీ మొదటికే వచ్చిందని వాపోతున్నారు.

జిల్లాలో 266 గ్రామాలు..

పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్, 266 గ్రామాలు, వీటి పరిధిలో 413 రేషన్ డీలర్లు ఉన్నారు. మొత్తం రేషన్ కార్డులు 2,10,147, యూనిట్లు 6,27,841 ఉన్నాయి. అన్నపూర్ణ కార్డులు 175, అంత్యోదయ కార్డులు 12,297 ఉన్నాయి. మెజారిటీ పట్టణాల్లో, గ్రామాల్లో నేటికీ బియ్యం రేషన్ దుకాణాలకు చేరలేదని డీలర్లు చెబుతున్నారు.

ప్రతినెలా ఆలస్యంగా పంపిణీ..

ప్రతి నెలా బియ్యం పంపిణీ ఆలస్యమవుతుండటంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చౌకధరల దుకాణాల్లో నెలనెలా 1వ తేదీన పంపిణీ ప్రారంభించి, రెండు, వారాలపాటు కొనసాగించాలి. కొన్నిసార్లు 10వ తేదీ తర్వాత గానీ దుకాణాలు తెరవడం లేదు. పేదలు ప్రతినెలా ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ నెల ఇప్పటికీ అందలేదు. గోదాం నుంచి తమకు రేషన్ కోటా ఇంకా అలాట్ కాలేదని కొందరు డీలర్లు అంటుంటే, వేలిముద్ర యంత్రానికి ఇంకా ఆన్‌లైన్ సర్వర్ కనెక్ట్ కాలేదని మరికొందరు చెబుతున్నారు.

డీడీ చెల్లింపులో జాప్యమే కారణం

పట్టణాల్లోని చౌక ధరల దుకాణాలకు స్టాక్ పాయింట్ నుంచి ప్రతినెలా 28, 29 తేదీల్లోనే లారీల్లో బియ్యం బస్తాలు చేరుతున్నాయి. గ్రామాల్లోని దుకాణాలకు 1వ తేదీ తర్వాత బియ్యం వస్తున్నాయి. అయినా లబ్ధిదారులకు ఆలస్యంగా పంపిణీ చేయడానికి గల కారణాలేమిటో అధికారులు చెప్పడం లేదన్న విమర్శలున్నాయి. కేటాయించే రేషన్ కోటా కోసం ఎఫ్‌సీఐకి ప్రతినెలా జిల్లా పౌర సరఫరాల శాఖ నుంచి డీడీ చెల్లించాలి. ఇందుకు ప్రభుత్వం నుంచి ఆమోదం రావాలి. ఈ ప్రక్రియలో ప్రతినెలా తీవ్ర జాప్యం జరుగుతుండటం సమస్యగా మారింది.

అధికారులకు ప్రణాళిక లేదు



రేషన్ బియ్యం పంపిణీలో అధికారులకు ప్రణాళిక లేదు. దీంతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నెల 15వ తేదీ దాటినా ఇప్పటికీ గ్రామాల్లో, పట్టణాల్లో బియ్యం ఇవ్వడం లేదు. ఇది అధికారుల వైఫల్యం కాదా? వెంటనే పంపిణీ చేయాలి.

– చింతకుంట విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి

ఇబ్బందులు కలగనివ్వం



డీలర్లకు వేలిముద్ర ద్వారా రేషన్ కోటా సరఫరా చేయాలని ప్రభుత్వ నిబంధన ఉంది. దీంతో సర్వర్ వల్ల ఈ ప్రక్రియ కొంత ఆలస్యమవుతోంది. రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేసేందుకు తేదీలను పొడిగిస్తాం. లబ్ధిదారులకు ఎట్టిపరిస్థితుల్లో ఇబ్బందులు కలగనివ్వం.

– తోట వెంకటేశ్, డీఎస్‌వో, పెద్దపల్లి

బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఇన్‌చార్జి జీఎం సైదులు

గోదావరిఖని: కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన సంగీతను బుధవారం ఆర్జీ-1 ఇన్‌చార్జి జీఎం సైదులు సన్మానించారు. సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఎస్టేట్ అధికారి బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాల్సిందే

- ఎమ్మెల్యే ఆశావహ అభ్యర్థుల డిమాండ్



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో పార్టీని బతికించుకోవాలంటే రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని ఎమ్మెల్యే ఆశావహ అభ్యర్థులు మిర్యాల రాజిరెడ్డి, కందుల సంధ్యారాణి, కొంకటి లక్ష్మీనారాయణ, పాతిపెల్లి ఎల్లయ్య, బయ్యపు మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జీడీకే-2 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ప్రజా ఆశీర్వాద యాత్ర ఐదోరోజుకు చేరిందన్నారు. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో చక్రం తిప్పడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తుంటే రామగుండంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అవినీతికి పాల్పడుతూ పార్టీకి చెడ్డ పేరు తీసుకువస్తున్నారని ఆరోపించారు. నాయకులు జనగామ శ్రీనివాస్, నూనె కొమురన్న, హరీశ్, సాయి, వెంకటేశ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

బోధన వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి

- రివ్యూ మీటింగ్‌లో గౌరవించాలి
- టీటీజీడీఏ సమావేశంలో తీర్మానం



సమావేశంలో చర్చిస్తున్న టీచింగ్ డాక్టర్లు

కోల్‌సిటీ(రామగుండం): ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న టీచింగ్ డాక్టర్ల డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని తెలంగాణ టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గోదావరిఖనిలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో బుధవారం టీటీజీడీఏ సమావేశాన్ని నిర్వహించారు. 56 నెలలుగా పెండింగ్‌లో ఉన్న 2016 పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలని, 2018 నుంచి నిలిపివేసిన జనరల్ ట్రాన్స్‌ఫర్లు చేపట్టాలని, అబ్జర్వ్‌డ్ డాక్టర్ల కోసం పే ఫిక్షేషన్‌లోని టెక్నికల్ ఇబ్బందులు తొలగించాలని, పదోన్నతుల్లో అన్ని కళాశాలల్లోని ఖాళీలు చూపాలని, సీనియార్టీ పద్ధతిన పదోన్నతి కల్పించాలని, ఒకే ర్యాంక్, ఒకే పని, ఒకే వేతనం అమలయ్యేలా చూడాలని, సమీక్ష సమావేశాల్లో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, దొడ్డిదారిన అక్రమ బదిలీలు, డిప్యూటేషన్లను నిలిపివేయాలని కోరారు. 58 ఏళ్లు దాటిన (22ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన) వారికి వీఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వాలని, సూపర్ స్పెషాలిటీ అలవెన్స్ ఇవ్వాలని సూచించారు. ఈ అంశాలపై ప్రొఫెసర్లు ఏగ్రీవంగా ఆమోదించారు. అలాగే టీటీజీడీఏ సభ్యత్వ నమోదుపైనా చర్చించారు. ప్రొఫెసర్లు నరేందర్, వేణుమాధవ్, అశోక్‌కుమార్, శ్రీదేవి, భానులక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాజు, శిరీష, యాకుబ్ ఫరీద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని: కారుణ్య నియామక పత్రాలను ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ పలువురికి అందజేశారు. బుధవారం తన కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఏడుగురు మాజీ ఉద్యోగుల వారసులకు ఉద్యోగం ఇచ్చారు. వారసత్వంగా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గైర్హాజరు లేకుండా క్రమశిక్షణతో ముందుకు సాగి, రక్షణతో పని చేయాలని చెప్పారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, సీనియర్ పర్సనల్ అధికారి వంశీధర్ పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రికకు లక్ష్మీకటాక్షం కరువు

- పేదింటి బిడ్డకు నీట్‌లో 979వ ర్యాంకు
- ఉండేందుకు ఇల్లు లేని దీనస్థితి
- వైద్య విద్యకు దాతలు సాయం చేయాలని వేడుకోలు



కుటుంబసభ్యులతో శరణ్య (కుడివైపు)

ఎలిగేడు: పేద కుటుంబంలో పుట్టి, ప్రభుత్వ విద్యాలయాల్లో చదివింది. పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించింది. నీట్‌లో ఉత్తమ ర్యాంకు తెచ్చుకుంది. తాను వైద్య విద్య చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డు వస్తున్నాయని, దాతలు సాయం చేయాలని కోరుతోంది ఆ సరస్వతీ పుత్రిక. వివరాల్లోకి వెళ్తే.. ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి కీర్తి రాజేశ్వరి-లక్ష్మయ్య దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి శరణ్య, శ్రీనిధి సంతానం. పెద్దమ్మాయి శరణ్య నీట్ ప్రవేశ పరీక్ష రాయగా రాష్ట్రస్థాయిలో 979వ ర్యాంకు వచ్చింది. వీరికి కనీసం ఉండటానికి ఇల్లు లేదు. తెలిసినవారి ఇంట్లో ఉంటున్నారు. అది కూడా శిథిలావస్థలో ఉండగా పరదాలు కప్పి, జీవనం సాగిస్తున్నారు. శరణ్య సుల్తాన్‌పూర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో చదివి, పదోతరగతిలో 9.2 జీపీఏ, జగిత్యాల జిల్లా తాటిపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్ బైపీసీలో 958 మార్కులు సాధించింది. శ్రీనిధి డిప్లొమా పూర్తి చేసింది. దంపతులు కూలి పనులు చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. శరణ్య వైద్య విద్యకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని, ఆ మొత్తాన్ని భరించే స్థోమత తమకు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు డాక్టర్ అవ్వాలని ఉందని, దాతలు తన చదువుకు సాయం చేయాలని శరణ్య కోరుతోంది. సహాయం చేయాల్సినవారు కీర్తి లక్ష్మయ్య 81066 22866 ఫోన్ నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే చేయాలని వేడుకుంటోంది.

సురక్షిత పని విధానాలు అవలంబించాలి



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గోదావరిఖని: పని స్థలాల్లో సురక్షిత పని విధానాలు అవలంబించాలని రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య అన్నారు. బుధవారం జీడీకే-11 గనిపై ఏర్పాటు చేసిన సేఫ్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నా భద్రత-నా బాధ్యత, నా భద్రతే-నా కుటుంబ భద్రత అనే నినాదాలతో ఈసారి సింగరేణి యాజమాన్యం ముందుకు సాగుతోందన్నారు. గ్రూప్ ఏజెంట్ చిలుక శ్రీనివాస్, ఇంజినీర్ రాందాస్, సత్యనారాయణ, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, గని మేనేజర్ ఎ.నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు



పెద్దపల్లిరూరల్: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన దొంగను పెద్దపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్‌కు చెందిన మహంకాళి దిలీప్ బుధవారం పెద్దపల్లిలో అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని, విచారించగా ద్విచక్ర వాహనాలు దొంగిలించిన విషయం చెప్పాడు. అతను ఇచ్చిన సమాచారంతో రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అనిల్ పేర్కొన్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లిలో ఒక ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడన్నారు. పెద్దపల్లి ఎస్సై మహేందర్, మల్లేశ్, ఏఎస్సై రామస్వామి ఉన్నారు.

జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో పలు సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో 36 పోస్టులు హిందీ-1, ఆంగ్లం-4, గణిత శాస్త్రం-6, వృక్షశాస్త్రం-6, జంతుశాస్త్రం-5, భౌతిక శాస్త్రం-4, రసాయనశాస్త్రం-2, అర్థశాస్త్రం-3, అర్థ శాస్త్రం (ఉర్దూ)-2, రాజనీతి శాస్త్రం-1, రాజనీతి శాస్త్రం(ఉర్దూ)-2 ఉన్నాయన్నారు. వృత్తివిద్యా విభాగంలో 06 పోస్టులు టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్01, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ (ఓఏ) టైప్ షార్ట్ హ్యాండ్-2, కంప్యూటర్ సైన్స్-1, ఎలక్ట్రికల్ టెక్నీషియన్-1, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్-1 ఉన్నాయని తెలిపారు. అర్హత గలవారు తమ దరఖాస్తులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈ నెల 24 సాయంత్రం 5గంటల్లోగా అందజేయాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం ఆపైన మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు.